# సద్గురు బోధలో జగద్గురు గీత

## 2వ అధ్యాయం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



# సద్గురు బోధలో జగద్గురు గీత

## 2వ అధ్యాయం

8.సాయి సచ్చరిత్ర రెండవ అధ్యాయ ప్రారంభంలో హేమాడ్ పంతు "సాయి బాబా దర్శనం వల్ల  వెనుకటి కర్మల బలము తగ్గిపోతాయి. క్రమంగా ప్రపంచమందు విరక్తి కలుగుతాయి. ఈ ప్రపంచమంతా సాయిబాబా రూపము వహించెను." అంటాడు.

సాయి దర్శనం తో ఆనందం ఎందుకు కలుగుతుందో చూద్దాం. ఈ లోకంలో అందరూ వ్యక్తిగత కోసం కామ్య కర్మలను చేస్తూనే ఉంటాము. అయితే ఇహలోక సౌఖ్యాలకని, ఐశ్వర్యాలకని ఎంత పరుగులు తీసినా, తృప్తి లభించదు. పైపెచ్చు దుఃఖం మిగులుతుంది.  అంతేకాక మన కర్మల యొక్క ఫలాలు మనకు రాబోయే జన్మలలో భోగించడానికి పెరిగిపోతూ ఉంటాయి.  మరి ఈస్థితి నుంచి బయటపడడం ఎలా.

యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి Id
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ || గీత 2 - 52 ||

మోహమనే ఊబి నుండి నీ బుద్ధి బయటపడినప్పుడే నీవు ఇప్పటి వరకు విన్న దాని గురించి, ఇక వినబోయేదాని గురించి ఇహపర లోక భోగముల విషయంలో వైరాగ్యం కలుగుతుంది.

అది ఎప్పుడు అంటే హేమాడ్ పంతు ద్వారా మనకి సాయి బోధించిన వెనుకటి జన్మ కర్మల బలం తగ్గితేనే సాధ్యం. ఈ మాటలోని అంతరార్థం, అలాగే కర్మల బలం తగ్గడం అంటే ఏమిటో చూద్దాం.

కర్మ బద్ధుడైన జీవి ఎప్పుడైతే జననం అన్నది పొందుతాడో, ఆ ప్రారబ్ధ కర్మ పూర్తికాగానే మరణించడం అన్నది అనివార్యం. అలాగే మరణించే లోపు ఈ జన్మలో కూడబెట్టిన పాప పుణ్యఫలాలను భోగించడానికి మళ్ళీ పుట్టడమూ తప్పదు. ఈ విధంగా జన్మం, తదనంతర మరణం తప్పదు అని తెలిసికూడా దాని గురించి బాధ పడడం అన్నది నీలాంటి వాడికి తగదు  అని శ్రీక్రిష్ణులవారు అర్జునుడికి చెప్తారు గీత అ.2 శ్లో.27 లో.

ఈ పదాల్లో నర్మగర్భంగా జీవన సాఫల్య మార్గాన్నే పొందు పరిచాడు కృష్ణయ్య.

మన సంస్కృతి, మన తెలుగు భాష గొప్పతనం ఏమిటంటే మనకి తెలీకుండానే ఎన్నో గొప్ప సూత్రాల్ని మనం వాడుక భాషలో బాగా వాడేస్తూ ఉంటాము. మన తెలుగు భాష ఆ విషయంలో మరీ ముందుకు పోయి ‘ఉసురు’  అనే పర భాషలో పర్యాయపదం లేని పదాన్ని మరీ పొందు పరుచుకుంది. అలాంటి మరో పదమే ఈ ‘ప్రారబ్ధం’.  చాలా సార్లు ఈ మాట వింటూ ఉంటాము. దీని గురించి సరిగ్గా అర్థం కావాలి అన్నా, శ్రీవారు పొందుపరిచిన నర్మగర్భ విషయం ఏమిటో గ్రహించాలి అన్నా ‘ప్రారబ్ధం’  యొక్క పూర్వోత్తరాలు తెలుసుకోడం అనివార్యం. అది ఇక్కడ చెప్పడం తప్పదు.

‘కర్మ బద్ధుడైన జీవికి జననం తప్పదు’  అన్నాడు కృష్ణయ్య. అది అర్థం కావాలి అసలు కర్మ బద్ధులం ఎలా అవుతామో తెలుసుకుందాం.

మన జన్మ అనేది మూడు రకాల కర్మల ఫలం. (1) సంచితం (2) ప్రారబ్ధం (3) ఆగామి.

ముందు మనకి బాగా సుపరిచితం అయిన ప్రారబ్ధం గురించి తెలుసు కుందాం.

ఒక జీవి మాత్రు గర్భంలో పిండ రూపం లో ఎదుగుతూ ఏడు నెలలు గర్భవాసం చేసి, తల్లి తినే కారం, వగరు వంటి వికారాలలో తేలుతూ, మళ్ళీ ఎందుకు ఈజన్మ దేవుడా, నన్ను నీలో కలుపుకో అని కోరతాడుట. ఆ టైంలోనే భగవంతుడు వాడికి అగుపించి ఈ సారికి నువ్వు పాత జన్మలలో మోసుకుంటూ వచ్చిన పుణ్య-పాప కార్యాల నీ బాలన్స్ (సంచితం) ఏదయితే ఉందో దాన్లో నించి ఇతమిద్ధమైన (ప్రారబ్ధం) ఇన్ని పుణ్యాల ఫలాన్ని, ఇన్ని పాపాల ఫలాన్ని అంటే సుఖదు:ఖాలని అనుభవించి కర్మక్షయం చేసుకుని రా అని పంపిస్తాడు.

అలా భగవంతుడిచే నిర్ణయించబడ్డ పాప పుణ్యఫలాల్నే ‘ప్రారబ్ధం; అంటాము. ఈ జన్మలో కొన్నే అనుభవించ గలం కాబట్టి ప్రారబ్దానికి నిర్ణయించబడ్డ తరువాత మిగిలిన భాగం ‘సంచితం’ అన్న పేరుతో మన ఎకౌంటు లో ఉంటుంది. ఏడవ నెలలో భగవంతుడిని నన్ను ఈ జన్మ కర్మల బంధంనించి నన్ను కాపాడు అని మొత్తుకున్న మనం; ఆ స్వామి ‘ఈ ప్రారబ్ధంతో వెళ్లి నీ కర్మ సంక్షయం చేసుకుని రా’ అన్న మాటల్లో జన్మరాహిత్య మార్గాన్ని తెలుసుకున్న మనం; ఈ లోకం లోకి రాగానే ఆ జన్మ రాహిత్యం అన్నదానికి చెయ్యాల్సినది ఏదో తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యక, నేను, నాది, నా

మనుషులు, నా ఆస్తి, నా అహం అనుకుంటూ; అన్ని పుణ్య పాప కర్మలకూ నేనే కర్తని అన్న భావంతో పోతూ; ప్రారబ్ధ కర్మల్ని అనుభవిస్తూనే; ఈ జీవనగమనం లో మళ్ళీ కొన్ని పుణ్య, పాప కర్మలను నేను చేస్తున్నా అన్న భావంతో జీవితాంతం చేస్తూ పోతాం.

దాని ఫలితంగా కొంత పుణ్యం లేదా పాప ఫలాలకి అర్హులం అవుతాం (ఆగామి).

కాపోతే మనకి ఈజన్మలో విధించబడ్డ ప్రారబ్ధం (ఇన్ని సుఖాలు, ఇన్ని దు:ఖాలు) తప్ప వేరేవి అనుభవించే అవకాశం లేదు కాబట్టి ఆ ఫలాలు రాబోయే జన్మలో భోగించడానికి మళ్ళీ మన ఎకౌంటు లో (ఆగామిగా) లిఖించ బడతాయి. ఇలా వచ్చే జన్మలలో అనుభవించేందుకు మనం సాధించిన కర్మఫలాలను 'ఆగామి' అంటారు. ఇది వెళ్లి మళ్ళీ మనం జన్మ పొందే లోపు సంచితం కి కలుస్తుంది.

ఈ విధంగా మనం కర్మలు 'అహం' అన్న భావంతో చేస్తూ పోతూ ప్రతీ క్షణం ఆగామి కర్మ ఫలాల్ని పెంపొందించుకుంటూ పెరుగుతన్న సంచితంని అనుభవించడానికి మళ్ళీ ప్రారబ్ధ కర్మ తో జన్మిస్తూ -మరిణిస్తూ- జన్మిస్తూ జన్మ రాహిత్యం అన్న స్థితికి కేవలం మోచేతి దూరం లో ఉంటూ ఉంటాము,
అలాకాకుండా బాబావారు ఆచరించి చూపిన విధంగా.. నేను నిమిత్త మాత్రుడను అన్న భావనతో కర్మలను చేసిన నాడు మన కర్మలు మనకి కర్తృత్వాన్ని ఆపాదించవు. అంతేకాక అలా చేయడం వల్ల, దాని నించి ప్రతిఫలం ఆశించే ప్రశ్నే లేదు కాబట్టి, మనకు సమత్వ బుద్ధి .. అంటే అందరినీ తనలోనూ, తనలో అందరినీ దర్శించే జ్ఞానం కలిగి ప్రశాంతతను పొందుతాము. అలా

సమత్వ బుద్ధిని పొందిన నాడు కలిగిన  లాభం ఏమిటో హేమాడ్ పంతు ద్వారా సాయి తెలుపగా, ఆ విషయాన్ని గీతలో శ్రీకృష్ణుల వారు వివరించిన వైనం చూద్దాము.

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః I

జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ II గీత 2 - 51 II

జ్ఞానులు, సమత్వ బుద్ధి కలిగి ఉండి, జననమరణ చక్రంలో బంధించే కర్మ ఫలములపై మమకార-ఆసక్తులను త్యజించి ఉంటారు. ఇలాంటి భావన తో పని చేయటం వలన దుఃఖరహితమైన స్థితిని పొందెదరు.

సమత్వ బుద్ధి కి సంబంధించిన ఈ జ్ఞానం కలగాలి అంటే ముందుగా మనం కర్మ ఫలములపై మమకారం విడిచిపెట్టి, అంతా భగవంతునికి సమర్పించి, ప్రశాంత చిత్తంతో అన్నిటినీ ఈశ్వర ప్రసాదం (అనుగ్రహం) లా స్వీకరించాలి. ఈ విధంగా చేయటం వలన మన పనులు పనులు జీవన్మరణ చక్రం లో పడవేసే కర్మ బంధాలను కలుగ చేయవు.

ఈ  సద్గుణాలలో ఏ ఒక్కటి మన సొంతం కావాలన్నా ముందు దేహాత్మ బుద్ధి, అహంకారం దూరం కావాలి. దానికి సులభమైన మార్గమే శ్రద్ధ - సబూరి.  శ్రద్ధ లేకున్న ఏదీ పొందలేము. శ్రద్ధ లేకుండా ఆత్మ జ్ఞానం కలగదు. ఇవన్నీ సాధించాలంటే ముందు

అహంకారము విడిచి, సద్గురువును శరణాగతి  కోరాలి.  అది చేసిన నాడు హేమాడ్ పంతు సాధించిన నిర్మలత్వం మనం కి కరతలామలకం అవుతుంది.

9.హేమడ్ పంతుచే బాబా వ్రాయించుకున్న సాయి సచ్చరిత్ర చదువుతుంటే మనకి తెలియకుండానే ఎంతో విలువైన ఉపనిషత్సారం, వేదాలు బోధించిన జీవనవిధానం, సత్పురుషులు నుడివిన ధర్మ మార్గం ఏమిటో మనకు తెలుస్తాయి. ఈ విషయం లోతుగా అధ్యయనం చేస్తున్న కొద్దీ తెలుస్తుంది.

అందుకే హేమాడ్ పంతు "బాబా ప్రభోదాలతో బ్రహ్మైక్యయోగము, అష్టాంగయోగ ప్రావీణ్యము పొందుతాము అంటారు. సరే తత్వజ్ఞానాన్ని ఎన్నో గ్రంధాలలో స్వాధ్యాయం తో సాధించుకోవచ్చు.

అయితే దాన్ని అనుష్ఠించిన మహనీయుడు మాత్రమె (1) పరమార్థం నిజముగా గురుబోదలవల్లనే చిక్కుతుంది" అన్న సూక్ష్మాన్ని పట్టుకుంటాడు.

ఇవన్నీ దేనికి మనం ప్రయత్న పూర్వకంగా సాధించాలసింది ఏమిటి అంటే కేవలం (2) మానవ జీవిత ధ్యేయం అయిన ఆత్మ జ్ఞానాన్ని పొందడమే.

మరి చేయాల్సిన సాధన ఏమిటి అంటే (షిర్డి సాయి భక్తులందరికీ ఎంతో సుపరిచితమైన) (3) శ్రద్ధ లేదా దృఢమైన నమ్మకము లేదా నిష్ఠ; సబూరీ లేదా ఓపిక.

చివరిలో పొందే అనుభవం ఏమిటి అంటే (4) సర్వేంద్రియ తృప్తి, మానసిక శాంతి, శాశ్వతానందం.

ఆధ్యాత్మికంగా ఎన్ని గ్రంధాలు తిరగేసినా ఉన్నది ఇదే తత్త్వం. వేదాలు చెప్పినా, ఉపనిషత్తులు చెప్పినా, పురాణాలు చెప్పినా ఉన్న సత్యం ఒకటే. ఇక్కడ

గ్రహించాల్సింది ఏమిటంటే అవన్నీ మనకి పరమ సత్యాన్ని బోధిస్తున్నాయి. అందులో ఏమీ సందేహం లేదు. అయితే దాన్ని ఎలా అనుష్ఠించాలో యుగ యుగాలకు నిలిచిపోయే గీతగా శ్రీకృష్ణుల వారు ప్రసాదిస్తే, బాబా వారు మన మధ్య ఉండి తానూ అనుష్టించి, ఎలా దానిని అనుసరించాలో సాధారణ జనాలకు చూపారు. లౌకిక భాషలో చెప్పాలంటే శ్రీకృష్ణుల వారు సిధాంతాన్ని బోధిస్తే, బాబా గారు వర్క్ బుక్ లో మన చేయి పట్టుకుని దిద్దించారు. అందుకే రెండూ కలిపి చూస్తే పూర్ణానందం మరింత చేరువ అవుతుంది.

ఇక్కడ ఈ మార్గం లో సాధకులకు మార్గదర్శకంగా ఉంటూ ఆధ్యాత్మికంగా ముందుకు నడిపిస్తున్న గురువులందరికీ ప్రణతులు సమర్పించడం మన సద్గురువు మనకు బోధించిన నడవడిక ని చూపిస్తుంది. అందుకే మనస్పూర్తిగా వారందరికీ మనసారా గురువందనం సమర్పిద్దాం.

ఇక పైన చెప్పిన ఒక్కో విషయంలో గీత బోధ చూద్దాం. గురువు ఆవశ్యకతని బహుశా భగవద్గీత అ.2 శ్లో.7 లో చెప్పిన విధంగా ఏ శిష్యుడు గ్రహించలేడేమో. చర్విత చరవణం అనుకోకపోతే మళ్ళీ ఒక్కసారి ఆ శ్లోకం తిరగేద్దాం.

కార్పణ్యదోషో పహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ।। గీత 2 – 7

నా కర్తవ్యం ఏమిటో నాకు తెలియటంలేదు మరియు ఆందోళన, పిరికితనము నన్ను ఆవహించాయి. నేను నీ శిష్యుడను, నీకు శరణాగతుడను. నాకు నిజముగా ఏది శ్రేయస్కరమో దానిని ఉపదేశించుము.

"పరమార్థము అనేది నిజంగా గురుబోధలవల్లనే చిక్కుతుంది" అని హేమాడ్ పంతు ద్వారా వ్యక్తీకరించిన భావానికి, అర్జునుల వారు పై శ్లోకంలో పలికిన మాటలకు ఎక్కడా తేడా లేదని గ్రహించగలరు. ఈ శ్లోకం పై విశదం గా ఇంతకు ముందు చూశాము.

ఇక రెండో సూత్రం అయిన మానవ జీవిత ధ్యేయం ఆత్మ జ్ఞానం అన్నది సాక్షాత్తు శ్రీకృష్ణుల వారి పదాల్లో చూద్దాం. సాధారణంగా మనం మన పిల్లల్ని ఏదన్నా కోర్స్ లో చేర్చాలి అంటే మన బంధువుల్లోనో, సన్నిహితుల్లోనో ఉన్న విద్యాధికులతో విచారణ చేసి నిర్ణయిస్తాం కదా. అదే ధ్యేయంగా చేసుకుని సాగుతాం. మరి అజ్ఞానం , అవిద్య, మాయ ఆవరించిన మానవులందరూ నేర్వాల్సిన విద్య; లేదా జ్ఞానం ఏమిటి అన్నది స్వామి వారు చెప్పింది విని, దానిని సాధించాలి అనుకోవడం విజ్ఞత అనిపించుకుంటుంది కదా.

సర్గాణామాదిరంతశ్చ
మధ్యం చైవాహమర్జున ।
అధ్యాత్మ విద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ ।। గీత 10 - 32 ।।.

ఓ అర్జునా, నేనే సమస్త సృష్టికి ఆది, మధ్య మరియు అంతము, అని తెలుసుకో. విద్యలలో నేను ఆధ్యాత్మిక విద్యని, మరియు సంవాదములలో తర్కబద్ధ నిర్ణయమును నేనే.

ఆధ్యాత్మ విద్య లేదా ఆత్మవిద్య యొక్క ఆవశ్యకత ఏమిటో సాధకులకు చెప్పనవసరం లేదు. మన మూలం ఏమిటో తెలిపి, దాన్నే ధ్యేయ వస్తువుగా

చేసుకుని, దానిలో ఐక్యం అవమని బోధించేదే ఆత్మవిద్య. దానికి సహాయకర సాధనలే మహావాక్యాలైన 'ప్రజ్ఞానం బ్రహ్మ' (ఐత్తరేయ) 'అహం బ్రహ్మాస్మి' (బృహదారణ్య) 'తత్వమసి' (చాందోగ్య) 'అయమాత్మాబ్రహ్మ' (మాండూక్య) ఇత్యాది ఉపనిషత్ మంత్రాలు.

లోకంలో ఇతర విద్యలు కార్య కారణం చేతా, తర్కం చేత, మనస్సు చేతా లేదా పంచేంద్రియాల చేతా తెలియబడవచ్చు. కాని ఆత్మవిద్య మాత్రం కేవలం గురు మార్గంలో సాధన చేసి సాధించ వలసిందే.

ఇక మూడవది అయిన శ్రద్ధ లేదా దృఢమైన నమ్మకము; సబూరీ లేదా ఓపిక విషయం లో గీత బోధ చూద్దాం.

అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో
న సుఖం సంశయాత్మనః ।। గీత 4 - 40

జ్ఞానము, విశ్వాసము రెండూ లేని వారు మరియు అనుమానం పడే స్వభావం కలవారు, పతనమైపోతారు. విశ్వాసములేక, సందేహించే వారికి ఈ లోకంలోనూ, పర లోకంలో కూడా సుఖం ఉండదు.

శ్రీకృష్ణుల వారు చెప్పిన విధంగానే సనాతనం కూడా శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండి మరియు ధృడ విశ్వాసం కలిగినవాడిని అత్యున్నత సాధకుడు గానూ, శాస్త్ర పరిజ్ఞానం లేకపోయినా గురువు మరియు భగవంతుని పై విశ్వాసం

ఉన్నవాడిని మధ్యమ స్థాయి సాధకుడు గానూ, శాస్త్ర పరిజ్ఞానం మరియు విశ్వాసం కూడా లేనివాడిని నిమ్న స్థాయి సాధకుడు గానూ గుర్తించమంటుంది. విజ్ఞులు చెప్పిన దానిని బట్టి మూడవ రకం వారు ఈ జన్మలో గాని లేదా ఆ పై జన్మలలో గాని సుఖము పొందలేరు.

ఇంతగా సనాతనం బోధించిన సత్యాన్ని సద్గురువు - జగద్గురువు మనకు సమయానుసారంగా బోధించారు.

ఇక నాలుగవదైన ధ్యాత్రు వస్తువైన సర్వేంద్రియ తృప్తి, మానసిక శాంతి, శాశ్వతానందం గురించి చూద్దాం.

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।
అనిత్యమసుఖం లోకం
ఇమం ప్రాప్య భజస్వ మామ్ ।। గీత 9 - 33

ఇక పుణ్యాత్ములైన రాజులు, మునుల గురించి ఏమి చెప్పాలి? కాబట్టి, తాత్కాలికమైన మరియు సుఖంలేని ఈ ప్రపంచం లోకి వచ్చాక, ఇక, నా యందు భక్తి తో నిమగ్నమవ్వుము.

ఈ శ్లోకం లో శ్రీ కృష్ణుల వారు ఈ జగత్తు అనిత్యమని, దుఃఖాలకు నిలయమని గ్రహించి, అనంత - నిత్య - చిద్ఘన - ఆనంద స్వరూపుడనైన తన పట్ల (భగవంతుడి) ధృఢ సంకల్పంతో, భక్తి లో నిమగ్నమై ఉండమని, జీవితాన్ని వ్యర్థ పరుచుకోవద్దని అర్జునుల వారికి బోధించారు.

అదే సూత్రాన్ని (భగవంతుడి పై మనసు నిలుపమని) మనకు 'బాబా వారు సబ్ కా మాలిక్ ఏక్' అని బోధించారు. ఇక ఆలస్యం దేనికి. ఆ భక్తిసాగరం లో మునకలేసి రేపు హేమాడ్ పంతు వ్యక్తీకరించిన సర్వేంద్రియ తృప్తి గురించి బాబా వారు ఈ జీవుడి ద్వారా ఏం సూచిస్తారో చూద్దాం.

10.షిర్డీ బాబాను దర్శించిన హేమడ్ పంతు (1) తన సర్వేంద్రియాలు తృప్తి చెందాయని (2) ఆకలిదప్పికలు మరిచి పోయా అని (3) బ్రహ్మైక్యయోగం - అష్టాంగయోగం - ధ్యానానందం కలిగాయని చెప్తాడు. వినడానికే కాదు, సాధనకు కూడా ఎంతో దుర్లభమైన బ్రహ్మైక్యయోగం, అష్టాంగయోగం అన్న పదాలు వాడాడు. మనకి క్లిష్టం గా అనిపించినా ధౌతీ, ఖండయోగం ఇత్యాది ప్రక్రియలు ఎంతో సహజంగా చేసే బాబాని అలా దర్శించిన ప్రియ భక్తులకు అది కష్టం కాదు కదూ. అది ఎందుకంటే అర్జునుడు శ్రీకృష్ణుడి తోనూ, కొందరు భక్తులు బాబా తోనూ చూపిన చనువు "బ్రహ్మ విద్ బ్రహ్మైవ భవతి" అన్న చందాన ఆయనతో వాళ్ళని మమైకం చేసింది.

బ్రహ్మ విద్ బ్రహ్మైవభవతి" అంటే పరబ్రహ్మమును తెలుసుకున్నవాడు పరబ్రహ్మమే అవుతాడు. సద్గురువు, పరబ్రహ్మ ఒకే నాణెముయొక్క రెండు పార్శ్వములు. ఒక విధంగా సద్గురువు పరబ్రహ్మముకంటే ఎక్కువే అవుతాడు. (పరబ్రహ్మమైన) కృష్ణ పరమాత్మ తాను చేయించ వలసినదంతా చక్కగా చేయించి, తాను మాత్రము ఏమీ తెలియనట్లు, దేనికీ అంటకుండా ఉంటాడు. (తత్త్వ విశ్లేషణ బ్లాగ్).

కాని సద్గురువు అలాకాదు. తాను కష్టపడి, ఆపరబ్రహ్మం గురించి ఆలోచించి, తెలుసుకొని, దాన్ననుభవించి, తానే అది అయ్యికూడా, తాను దానిలో లయమవ్వకుండా, తనను ఆశ్రయించిన శిష్యులకు సందేహ నివృత్తిచేసి, పరబ్రహ్మ జ్ఞానమునుపదేశించి, దానిని తాను ఎలా అనుభవించాడో, అదేవిధంగా శిష్యులకు కూడా అనుభవంలోకి వచ్చేటట్లు చేస్తాడు.

అట్టి అనుభవాన్నే ఆరోజు హేమాడ్ పంతు, ఈరోజుల్లో ఎందరో భక్తులు స్వామితో మమైకమై తమకు తెలీకుండానే కంటి నుంచి జారే అశ్రు బిందువులతో మనస్సులోనే ఆయనకి అభిషేకం చేసేస్తూ తాదాత్మ్యం పొందుతున్నారు.

అలా అని ఆయనకీ ప్రియులు అప్రియులు ఉన్నారు అనుకుంటే పొరపాటు. ఎందుకంటే పరబ్రహ్మనికి ప్రియాతి ప్రియాలు ఉండవు. వారు అందరినీ ఒకేలా ఆదరిస్తారు. అందరినీ తమ చూపులతోనే ఉద్ధరిస్తారు.

సమోఽహం సర్వభూతేషు

న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।

యే భజంతి తు మాం భక్త్యా

మయి తే తేషు చాప్యహమ్ ।। గీత 9 - 29 ।।

నేను సర్వ ప్రాణుల యందు సమత్వ బుద్ధి తో ఉంటాను, నేను ఎవరి పట్ల పక్షపాతం తో కానీ లేదా విరోధ భావం తో కానీ ఉండను. కానీ, ప్రేమతో నన్ను ఆరాధించే భక్తులు నాయందే నివసిస్తారు మరియు నేను వారి యందు నివసిస్తాను.

అంటే మనకి ప్రియులుగా కనిపిస్తున్న ఆ కొంత మంది భక్తులలాగా మనం కూడా అనన్య భక్తితో ఆయనని ఆరాధిస్తే మనం ఆ పరబ్రహ్మలోనూ, ఆ పరబ్రహ్మం మనలోనూ మమైకం అవుతుంది అనేగా. అదే మనము మామూలు పదాల్లో అర్ధం చేసుకోవాల్సిన బ్రహ్మైవ భవతి లేదా జీవ-బ్రహ్మైక్య భావం.

నిజం చెప్పాలంటే బ్రహ్మైక్య యోగం అర్ధం కావాలంటే వేదాలు, ఉపనిషత్తులు, గీత, సనాతన సాహిత్యం తిరగేయాలి. అదేమీ లేకుండా అనుభవ గ్రాహ్యంగా తన నడవడికలోనే బాబా వారు బోధించారు.

ఇక సాధారణ భక్తులు అష్టాంగయోగ ఆనందాన్ని ఎలా అనుభావిస్తారు అన్నది తెలియాలి అంటే అసలు యోగులు అంటే ఎవరో బాబా బోధించిన మార్గంలోనూ, కృష్ణుడు నుడివిన మార్గం లోనూ చూద్దాం:

యదా హి నేంద్రియార్థేషు
న కర్మస్వనుషజ్జతే ।
సర్వసంకల్పసన్న్యాసీ
యోగారూఢస్తదోచ్యతే ।। గీత 6 - 4 ।।

ఎప్పుడైతే వ్యక్తి ఇంద్రియ వస్తు-విషయముల పట్ల మరియు కర్మల పట్ల ఆసక్తి రహితంగా ఉంటాడో ఆ వ్యక్తి యోగ శాస్త్రంలో ఉన్నతమైన స్థానం పొందినట్టు;

ఎందుకంటే అతడు సమస్త కర్మ ఫలాలను అనుభవించాలనే కోరికలను త్యజించాడు కావున.

శ్రద్ధగా బాబా వారి బోధలు ఆచరిస్తూ పోతూంటే మనస్సు భగవంతునితో అనుసంధానమై, జగత్తు నుండి దూరమైపోతుంది. ఫలితాలు వెంటనే ఆశించకుండా ఓపికతో (సబూరి) ముందుకు సాగిననాడు ఇంద్రియ భోగాలను అనుభవించాలనే అన్ని కోరికలూ భస్మమై, మనస్సు ఇక ఇంద్రియ ప్రేరిత క్రియలకై పరుగులు తీయదు. దానితో ఇంద్రియ జయం కరతలామలకం అవుతుంది. దాంతో హేమాడ్ పంతు అన్నట్లుగా ఆకలిదప్పులు తెలియక పోవడం అన్నది చాల నిమ్న స్థాయి అనుభవం అవుతుంది.

సరే ఇంద్రియజయంతో ఏమి సాధిస్తాము అంటారా. ఇంద్రియ జయానికి ఇంతకు ముందు సాధించిన సర్వ భూత దయ, సమబుద్ధి తోడైతే బ్రహ్మైక్య భావన ఎంత సులువో ఈ క్రింది శ్లోకంలో చూడండి.

ఆత్మౌపమ్యేన సర్వత్ర

సమం పశ్యతి యోఽర్జున ।

సుఖం వా యది వా దుఃఖం

స యోగీ పరమో మతః ।। గీత 6 - 32 ।

సర్వ ప్రాణులను సమానముగా దర్శిస్తూ, ఇతరుల సుఖాలకు, దుఃఖాలకు, అవి తనకే అయినట్టు స్పందించేవారిని, పరిపూర్ణ యోగులుగా పరిగణిస్తాను.

మన శరీరం లో ఎక్కడ దెబ్బ తగిలినా అది మనకు హాని జరిగినట్టే అన్న అహంకార, అవిద్య,అజ్ఞాన భావనలో ఉంటాము. ఎప్పుడైతే పైన ఉదాహరించిన స్థితిని పొందుతామో అన్ని ప్రాణులలో భగవంతుడిని దర్శించి, ఇతరుల సుఖ-దుఃఖాలను కూడా తమవాటిగానే భావించి సమబుద్ధి లో స్థిరంగా ఉంటాము. ఈ భావన మనం బాబాగారు ముందు ముందు తన చేతిని ధునిలో పెట్టి ఎక్కడో దూరంలో ఉన్న భక్తురాలి బిడ్డను కాపాడిన ఉదంతం లోనూ, మనసు చంచలం అవుతున్న శిష్యుడిని సున్నితంగా హెచ్చరించి ధ్యేయ మార్గం వైపు తిప్పిన వైనం లోనూ చూస్తాము.

అదే వాసుదేవస్సర్వమితి అన్న జగద్గురు భావన, సబ్ కా మాలిక్ ఏక్ అన్న సద్గురు భక్తుల బ్రహ్మీ భావన.

11.సాయి సత్చరిత్ర రెండవ అధ్యాయం లో హేమాడ్ పంతు దాదరుకి టిక్కెట్టుకొని, రైలు లో కూర్చోగా ఒక మహమ్మదీయుడు హడావుడిగా ఎక్కి దాదరు స్టేషనులో దిగవద్దనీ, బోరీబందరు స్టేషనులో దిగమని సలహా ఇవ్వడం చూస్తాము. ఇది బాబా సర్వజ్ఞత్వాన్ని సూచిస్తోందని అందరికి అర్థం అవుతుంది.

అసలు సర్వజ్ఞత్వం, సర్వ వ్యాపకత్వం ఇవన్నీ షోడశ కళా పరిపూర్ణుడైన శ్రీకృష్ణుడి లోని కొన్ని విభూతులు. ఇవి అర్థం కావాలంటే అసలు పూర్ణావతారం లక్షణాలు చూద్దాం.

సాధారణంగా అన్న, ప్రాణ, మనో, విజ్ఞాన, ఆనందమయ కళలు (5) సాధారణ మానవులందరికీ ఉంటాయి. ఆరవదైన 'విభూతి' లేదా ఐశ్వర్యము అన్నది సాధారణ మానవులలో వారివారి కర్మ, జ్ఞానాలకు అనుగుణంగా ఎక్కువ, తక్కువలుగా ఉంటుంది. భగవంతునిలో పరిపూర్ణంగా ఉంటుంది.

ఐశ్వరస్య సమగ్రస్య ధర్మస్స్యయశసః శ్రియః
జ్ఞానవైరాగ్యయోశ్చైవ
షణ్ణాం భగ ఇతీరణా.

సమగ్రమైన ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, సంపద (శోభ), జ్ఞానం, వైరాగ్యం- ఈ ఆరింటికీ 'భగము' అని పేరు. భగము కల్గి ఉన్నవాడు భగవంతుడు.
మొత్తం అలాంటి పదహారు కళలలో ఒకటైన 'యోగం' అన్న విషయంలో స్వామి వారి యోగీశ్వర తత్త్వం నిన్న చూశాము.
ఇంకా విశదంగా చెప్పాలంటే ఒక యోగ నిష్ణాతుడికి, అలాగే పరిపూర్ణ యోగికి ఉండాల్సిన లక్షణాలు గీత అ. 13 లో శ్లో. 8 నించి 12 లో వివరించిన దాని ప్రకారం నమ్రత; దంభము (కృత్రిమ బుద్ధి) లేకుండా ఉండుట; అహింస; క్షమా గుణము; సరళత; గురు సేవ; శరీర-మనస్సుల పరిశుద్ధత; నిశ్చల బుద్ధి; మరియు ఆత్మ-నిగ్రహము; ఇంద్రియభోగ వస్తువిషయములపై అనాసక్తి; అహంకారము లేకుండుట; జన్మ, మృత్యు, జరా, వ్యాధుల దురవస్థను గుర్తుచేసుకోవటం; మమకారరాహిత్యం; భార్య(భర్త), పిల్లలు, ఇల్లు వంటి వాటిని అంటుకొని (యావ) లేకుండా ఉండుట; జీవితంలో అనుకూల లేదా ప్రతికూల పరిస్థితులలో సమత్వ బుద్ధితో ఉండుటము అనేవి పరిపూర్ణుడి లక్షణాలు.

అవి సాధించాలంటే ముఖ్యంగా భగవంతుడి పట్ల నిశ్చలమైన మరియు అనన్య భక్తి కలిగి ఉండుట; ఏకాంత ప్రదేశాల్లో ఉండటానికే ఇష్టపడుట మరియు ప్రాపంచిక సమాజం పట్ల అనాసక్తి; ఆధ్యాత్మిక జ్ఞానములో అచంచల విశ్వాసం; మరియు పరమ సత్యముకై తత్త్వాన్వేషణ అనే సాధనల ద్వారా జ్ఞానం పొందాలి.

అప్పుడే అందరినీ ఒకేలా చూసి, ఆదరించి, దరి చేర్చగలిగే సమ దర్శనత్వం చేరువవుతుంది. అది సాధించిన వాడే యోగోత్తముడు.

ఇక మనం హేమాడ్ పంతు రైలు ప్రయాణం విషయం లో స్వామి వారు చూపిన సర్వజ్ఞత్వ కళ గురించి చూద్దాం.

సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ
నిర్గుణం గుణభోక్తృ చ ॥
గీత 9 - 15 ॥

భగవంతుడు అంటే ఇంద్రియ వస్తువిషయములను అన్నింటినీ ఆయన తెలుసుకొనగలిగినా, ఆయన ఇంద్రియ రహితుడు. ఆయనకు దేనిపట్ల కూడా మమకారానుబంధము లేదు, అయినా ఆయనే అన్నింటిని సంరక్షించి పోషించేవాడు. ఆయన నిర్గుణుడు అయినా, ప్రకృతి త్రిగుణములకు భోక్త ఆయనే.

పైన చెప్పిన విషయాల్లో ఏ లీల, కళ లేదా విభూతి బాబా వారిలో లేదో మీరే ఆలోచించండి. సర్వ వ్యాపకత్వం, సర్వ నియామకత్వం ఇత్యాది విభూతులు

కలవారు కాబట్టే చాలా సార్లు భక్తులతో తాను షిర్డీ లోనే ఉంటాను అనుకోవద్దని, సర్వాంతర్యామి అయిన తాను ఎక్కడికైనా, ఎప్పుడైనా వెళ్ళగలననీ ముందు ముందు అధ్యాయాలలో మనకు చూపించారు.

సర్వజ్ఞుడు, సాక్షాత్తు పరిపూర్ణావతారుడు కాబట్టే ముందు రాబోయే అధ్యాయాలలో నానా సాహెబ్ చాందోర్కర్కి గీత అ.4 శ్లో.34 లోని 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అన్న దాని అంతరార్థం వివరించారు. అలాగే ఎందరో గురువులకు భిన్నంగా 'ఉపదేక్షితం తే జ్ఞానం' అంటే జ్ఞానాన్ని ఉపదేశించడం మాత్రమే కాదని, అజ్ఞానం తొలగించడం అని విలక్షణంగా తన భక్తులకు.. ఉన్న ఒకటే సత్యాన్ని బోధిస్తున్నట్లు తెలీకుండానే వారిచే అనుష్టింప చేశారు. చెప్పుకుంటూ పొతే సర్వేశ్వరత్వం 'సర్వసిద్ధి' కళ ఇత్యాదులెన్నో. వాట్లన్నిటి గురించి సమయోచితంగా తెలుసుకుందాం.

12.ఈ రెండో అధ్యాయం ముగింపులో లేనిపోని వాదులాటలో సమయం గడిపిన భక్తులను వారించి చివర్లో "మార్గదర్శకుడు తిన్నగా గమ్యస్థానము చేర్చును. మార్గమధ్యమున ఉన్న తోడేళ్ళు, పులులు, గోతుల నుండి తప్పించును. మార్గదర్శకుడు లేకపోతే అడవి మృగాల వల్ల చంపబడ వచ్చును. లేదా దారి తప్పి గుంటలలో పడిపోవచ్చును" అన్నారని చదువుకున్నాము.

అనంతమైన జన్మలలో ప్రపంచంతో మమకారం వలన మన హృదయములు మొరటుగా, మలినముతో ఉన్నాయి. మనం అంతర్గత సౌదర్యంతో ఉండాలంటే మనం బాధని సహించి, ఈ ప్రపంచాన్ని తన పని చేసుకోనివ్వాలి. కర్మ

యోగులు భక్తితో పని చేస్తూ, ఫలితముల పట్ల సమదృష్టి తో ఉంటారు మరియు భగవంతుని యందే తమ మనస్సుని లగ్నం చేయటానికి అభ్యాసం చేస్తుంటారు.

అలాంటి యోగి పుంగవులు లేదా సద్గురువులు మాత్రమె మనల్ని సంసారం అనే సముద్రాన్ని తరింప చేయగలుగుతారు. మరి అలాంటి వాళ్ళని ఎలా తెలుసుకోవాలి అన్నది మనకి గీతలో ఈ శ్లోకం లో కనిపిస్తుంది.

జ్ఞేయః స నిత్యసంన్యాసీ

యో న ద్వేష్టి న కాంక్షతి ।

నిర్ద్వంద్వో హి మహాబాహో

సుఖం బంధాత్ప్రముచ్యతే ।। గీత 5 - 3 ।।

దేనినీ ద్వేషింపక, దేనినీ ఆశించక ఉన్న కర్మ యోగులను నిత్య సన్యాసులుగా తెలుసుకొనవలెను. అన్ని రకాల ద్వందములకు అతీతంగా ఉండి, వారు భౌతిక బంధాల నుండి సునాయాసముగా విముక్తులవుతారు.

కాయేన మనసా బుద్ధ్యా

కేవలైరింద్రియైరపి ।

యోగినః కర్మ కుర్వంతి

సంగం త్యక్త్వాత్మశుద్ధయే ।। గీత 5 -11 ।

యోగులు, మమకారాసక్తిని విడిచిపెట్టి, కేవలం ఆత్మ శుద్ధి కోసం మాత్రమే, శరీరము, మనస్సు, ఇంద్రియములు, మనస్సు లతో కర్మలను ఆచరిస్తూ ఉంటారు.

యోగి పుంగవులు వాస్తవాన్ని తెలుసుకుని స్వార్ధ కోరికలను త్యజించి, అన్ని కర్మలూ భగవత్ ప్రీతి కోసమే చేస్తారు. తాము చేసే ప్రతిపని భగవంతునికి అంకితం చేస్తారు. అదే బాబా గారు అల్లాహ్ మాలిక్ అంటూ మనకి బోధించారు. నిజానికి భగవంతునికి మన నుండి ఏమీ అక్కరలేదు. ఆయనే సర్వ లోక నాయకుడు, సమస్త లోకాలకు ప్రభువు. ఆయనకు మనం ఏమి ఇవ్వగలం.

మమ నాథ యద్ ఆస్తి యో ఉస్మ్యహం
సకలం తద్ధి తవైవ మాధవ
నియత-స్వం ఇతి ప్రబుద్ధ-ధైర్
అథ వా కిం ను సమర్పయామి తే (శ్రీ స్తోత్ర రత్న, 50)

"లక్ష్మి దేవి భర్త అయిన ఓ విష్ణుమూర్తి, నేను అజ్ఞానంలో ఉన్నప్పుడు, నేను నీకు చాలా ఇద్దామనుకున్నాను. కానీ, జ్ఞానం పెంపొందించుకున్న తరువాత నా దగ్గర ఉన్నదంతా నీదే అని తెలుసుకున్నాను. నేను నీకు ఇక ఏమి ఇవ్వగలను?"

ఇలా ఉండమనే బాబా వారు మనకు బోధించారు. బాబా తను భక్తుల ముందు ఉన్నంత సేపు పవిత్ర ధుని ముందు ఉండి, బోధిస్తూ ధుని లో వేస్తూనే ఉంటూ,

ఒక విధంగా మన ప్రతి కర్మని కూడా ఆ భగవంతుడు అన్న జ్ఞాన ధుని లో అంకితం చేయమనే బోధించారు.

యో మాం పశ్యతి సర్వత్ర
 సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి
స చ మే న ప్రణశ్యతి || గీత 6 - 30 ||

ఎవరైతే నన్ను అంతటా దర్శిస్తారో, అన్నిటినీ నా యందే దర్శిస్తారో, వారు నన్ను కోల్పోరు, నేను వారిని కోల్పోను. ఇంత జ్ఞాన సముద్రాన్ని శ్రద్ధ సబూరి అన్న గుళికలుగా చేసి, దానికి ఏకాదశ సూత్రాలు అనే నియమాలను విధించి, అవి ఆచరించే వారితో ఎప్పుడూ ఉంటూ వారిని దరిచేరుస్తున్నారు మన బాబా.

అభ్యాసయోగయుక్తేన
చేతసా నాన్యగామినా ।
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ || 8 ||
అభ్యాసము తో, ఓ పార్థా, నిరంతరంగా మనస్సుని, ఎటూ పోనీయక, పరమేశ్వరుడైన నన్ను స్మరించుట యందే నిమగ్నం చేస్తే, నీవు తప్పకుండా నన్ను పొందగలవు.

మనస్సుని సర్వదా భగవంతుని యందే ధ్యానం లో నిమగ్నం చేయమని భగవద్గీత బోధిస్తే, బాబా వారు మనకు ఎల్లప్పుడు తన దగ్గరకు వచ్చిన వాళ్ళ

రక్షణ అనే సేవ లో ఉంటూ, ఎలా అందరిలో ఉన్న అంతర్యామిని ఉపాసించ వచ్చో స్వయానా చూపించారు.

ఎప్పుడైతే మనస్సు భగవంతునితో అనుసంధానం అవుతుందో, భగవత్ కృప అందుతుంది. భగవంతుని కృప ద్వారానే, వ్యక్తి భౌతిక బంధాల నుండి విముక్తి పొందుతాడు, మరియు అనంతమైన దివ్య ఆనందాన్ని, దివ్య జ్ఞానాన్ని మరియు భగవంతుని దివ్య ప్రేమని పొందుతాడు. అటువంటి మన ప్రేమరూప బాబాను మనతోనే ఉండి మనకు ఆధ్యాత్మిక మార్గ నిర్దేశకం చేయమని ప్రార్థిద్దాం. స్వస్తి. (గీత శ్లోకార్థాలు ముకుందానంద స్వామివి)

2వ ఆధ్యాయం సమాప్తం.

kodandaramam@gmail.com

